# మర్యాదస్తులు

ప్రభాకరరెడ్డి కృష్ణాపురం దగ్గర బస్సు దిగాడు. తను వెళ్ళవలసిన ఊరు పేరు తప్ప- అది కృష్ణాపురానికి ఎంతదూరంలో వుందో, ఏ దిక్కున వుందో కూడా తెలీదు. బస్సుస్టాండు దగ్గరే ఒక చిన్న టీ హోటలు వుంది. అక్కడ ఐదారుమంది కూచొని టీ తాగుతున్నారు. ప్రభాకరరెడ్డి వారి దగ్గరికి వెళ్ళి "ఏమండీ రంగరాజుపల్లెకు ఎలా వెళ్ళాలి?" అంటూ ప్రశ్నించాడు. టీ తాగుతున్న ఒకతను లేచివచ్చి "ఇదిగో ఈ దారివెంట వెళ్ళండి. అట్టే దూరం లేదు. రెండుమైళ్ళు" అంటూ దారి చూపాడు.

రెండు మైళ్ళు అనగానే ప్రభాకరానికి భయం పట్టుకుంది. టైం చూచాడు. ఐదు అయింది. ఎంతలేదన్నా అక్కడికి వెళ్ళేసరికి ఆరు, ఆరున్నర అవుతుంది. బాగా చీకటికూడా పడవచ్చు. తీరా వెళ్తే అక్కడ ఆ కరణంగారు వున్నారో లేరో? ఆయన లేకపోతే భోజనం పడక అన్నీ యిబ్బందులే. అక్కడ నుంచి యిక్కడికి రావాలంటే మళ్ళీ రెండుమైళ్ళు నడవాలి. తప్పదు. ఉద్యోగంఅంటూ ఒకటి ఏడ్చాక ఇబ్బందులు పడక తీరదు, అని తనకు తాను సర్దిచెప్పుకొని కాళ్ళీడ్చుకుంటూ బయలుదేరాడు.

దారి బాగానేవుంది. తను అనుకున్న టైమ్‌కు కాస్త ముందే ఊరు చేరుకున్నాడు. చిన్నపల్లె, అట్టే మనుషులు కూడా కన్పించడంలేదు. కాసేపటికి ఓ పెద్దమనిషి కనిపించాడు

"ఏమండీ! కరణంగారిల్లు ఎటువేపో కొంచెం చెబుతారా?" అంటూ ప్రభాకరం ఆ పెద్దమనిషిని అడిగాడు.

"ఎవరూ, చెవిటి నారాయణరావుగారి ఇల్లా, ఇదిగో ఇటే వెళ్ళి మలుపు తిరగండి, మూడోఇల్లు మేడ" అంటూ గుర్తుచెప్పాడు.

కరణంగారి పేరు నారాయణరావుగా రన్నమాట ప్రభాకరం మలుపు తిరిగి మేడముందు నిలిచాడు. పాతకాలపు మేడ పెద్దదే. వాకిట్లో నిలబడి "నారాయణరావుగారూ" అని కేకవేశాడు ప్రభాకరం.

'ఎవరూ ?' అంటూ ఇంట్లోనుంచి స్త్రీ కంఠం. ప్రభాకరానికి కొంచెం చిరాకు కలిగింది. తను ఎవరయిందీ ఇక్కడినుంచే కేకపెట్టాలా! ఏంసమాధానం చెప్పకుండా నిలబడ్డాడు సమాధానం రాకపోయేసరికి ఇంట్లో నుంచి ఒక అమ్మాయి బయటికివచ్చి ప్రశ్నార్థకంగా ప్రభాకరంవైపు చూసింది.

"నారాయణరావుగారు లేరాండీ ?" అన్నాడు ప్రభాకరం.

"ఇంట్లో లేరు. ఊళ్లో వున్నారు," అంటూ ఆ అమ్మాయి సమాధానం చెప్పింది.

ప్రభాకరానికి గుండెలు కుదుట పడ్డాయి. ఆ అమ్మాయి ఊళ్లో లేడని ఎక్కడ అంటుందో-తను ఏ చావు చావాలి అని ఆలోచిస్తున్నాడు.

"ఎవరినన్నా పంపి పిలిపించండి. తాలూకా ఆఫీసునుంచి స్టాటిస్టికల్ అసిస్టెంటు వచ్చాడని చెప్పిపంపండి." అన్నాడు ప్రభాకరం. ఎవరో ఉద్యోగి అని అర్థం అయ్యాక "లోపలికివచ్చి కూర్చోండి," అంటూ ఆ అమ్మాయి కుర్చీ చూపించింది.

దొడ్లో కట్టెలు కొడుతున్న మనిషిని కేకేసి "వెళ్ళి నాన్నగారు ఎక్కడున్నారో పిలుచుకురా. ఎవరో తాలూకా ఆఫీసు నుంచి వచ్చారని చెప్పు," అంటూ వాడికి పురమాయించి ప్రభాకరంవైపు తిరిగి "మంచి నీళ్ళు త్రాగుతారా ?" అంది రెండుమైళ్ళు నడిచి వచ్చాడు. దాహంగానే వుంది. 'ఇవ్వండి' అన్నాడు. ఆ అమ్మాయి నీళ్ళు తెచ్చియిచ్చింది. నీళ్లు త్రాగగానే సగం ప్రాణం కుదుటపడింది.

ఒకసారి ఇల్లంతా కలయచూశాడు. ఇంట్లో ఎక్కడా మనుషుల అలికిడిలేదు. కరణంగారు, ఈ అమ్మాయి ఇద్దరే వుంటున్నారేమో ! ఈ అమ్మాయికి ఇంకా పెళ్ళికాలేదేమో ? అన్న సందేహాలు కలిగాయి.

"ఏమండీ! కాఫీ తీసుకుంటారా?" అంది ఆ అమ్మాయి లోప ల్నుంచి. ఇచ్చేదేదో అడక్కుండా యిస్తే బాగుంటుంది. తీసుకుంటారా అంటే తీసుకుంటా ననడం ఏం మర్యాద? "అబ్బే అవసరం లేదండీ" అన్నాడు. కాని మనసు కాఫీమీదకే వెడుతోంది. వచ్చేటప్పుడు టీ హోటల్లో టీ తాగుదామనుకున్నాడు. కానీ-ట్వీడు పాంటుతో అక్కడ కూర్చోవడం యిష్టంలేక - టీ తాగలేదు.

ఆ అమ్మాయి ప్రభాకరం మొగమాట పడుతున్నాడని గ్రహించి నట్టు వుంది. కప్పుతో కాఫీ తెచ్చి "ఫరవాలేదు తీసుకోండి బ్రూకాఫీ" అంది.

కప్పు అందుకుంటూ కాళ్ళవైపు చూచాడు. మెట్టెలున్నాయి. పెళ్ళ యిన అమ్మాయే.

కాఫీ తాగుతుండగా నారాయణరావుగారు వచ్చారు. వచ్చీరాగానే నమస్కారం చేశాడు.

"నేను స్టాటిస్టికల్ అసిస్టెంటునండీ" అంటూ తన్ను తాను పరి చయం చేసుకున్నాడు ప్రభాకరం.

నారాయణరావు నవ్వుతున్నాడు.

"నాన్నగారికి అట్లాంటి మాటలు వినిపించవు కొంచెం గట్టిగా మాట్లాడాలండీ" కరణంగారి అమ్మాయి వంటింట్లోనుంచి నవ్వుతూ అంది.

ప్రభాకరానికి చటుక్కున జ్ఞాపకం వచ్చింది. ఈసారి అదే మాటని సాధ్యమైనంత గట్టిగా చెప్పాడు.

ఆయన అంతకన్నా గట్టిగా నవ్వి "మీరా; డిప్యూటీ తాహశిల్దా రేమో నని పరుగెత్తు కొచ్చాను" అన్నాడు.

ప్రభాకరానికి ఈ జవాబు కోపమే తెప్పించింది. కాని కోపాలకూ, తాపాలకూ, కాలంకాదు యిది బతిమాలి పనులు చేయించుకోవాలి.

ప్రభాకరం తాను వచ్చినపని చెప్పాడు. సాంతం ఆయనకు వివ రించేసరికి గొంతు బొంగురుపోయింది. ఆయన అంతా విని "సరేలెండి,

రాత్రి కూచొని మీకు కావలసిన లెక్కలన్నీ వేసియిస్తాను." అని వంటింటిముందు నిలబడి" "నిర్మలా; ఈయనకు కూడా వంటచెయ్యమ్మా" అని కేక పెట్టాడు. ఆ అమ్మాయికి కూడా చెవుడు వున్నట్టు!

ఎనిమిదింటికి నిర్మలవచ్చి "భోజనానికి లేవండి అంది. ఎనిమి దింటికే ఏం భోజనమండీ" అన్నాడు ప్రభాకరం, పల్లెలుకదండీ- ఏ పను లుంటాయి. ఎనిమిదింటికి భోంచేసి తొమ్మిదింటికి నిద్రపోతాం అంది ఆ అమ్మాయి.

భోంచేస్తూ ప్రభాకరం "ఏమండీ! అమ్మాయి, మీరు ఇద్దరే వుంటున్నారా ?" అన్నాడు కరణంగార్ని వుద్దేశించి.

"మీరు అంతగా మెల్లగా మాట్లాడితే ఆయనకు వినిపించదండీ" అంది కూరవడ్డిస్తూ నిర్మల.

ప్రభాకరం ఆయనకు చెముడని మర్చిపోయి మామూలుగా మాట్లాడి నందుకు నాలుక కరుచుకున్నాడు, నిర్మలే సమాధానం చెప్పింది.

అమ్మ జబ్బుపడి హాస్పిటల్లో వుందండీ. నాన్న గారు మీరొచ్చే ముందుగానే హాస్పిటల్ నుంచి వచ్చారు. నన్ను ఇక్కడే దగ్గర రంగా పురానికి యిచ్చారు. నాన్నకి యిబ్బందని వచ్చాను."

"ఏమ్మా నీ భర్త ఏంచేస్తాడు ?" అన్నాడు ప్రభాకరం.

"చదువుకున్నవాడు కాదండి, వ్యవసాయమే" అంది.

"ఏమిటి ?" అన్నాడు నారాయణరావు కలుగజేసికొని.

"మీ అల్లుడుగారు ఏం చేస్తారు ? అని అడుగుతున్నాను,

నారాయణరావుగారు ఇల్లు ఎగిరి పొయ్యేటట్టు నవ్వాడు.

"అల్లునికేం. నాలుగులక్షల అధికారి. నాలుగు తరాలు కూచొని తిన్నా తరగదు," అన్నాడు నవ్వు మధ్య.

"చదువులంటే పొట్టకూటి చదువులయిపొయ్యాయి. ఇంత ఆస్తి పాస్తులున్నదానికి సమానం లేదు," అన్నాడు ప్రభాకరం.

"మీరు బాగానే చెబుతారు," అంది ఆ అమ్మాయి నవ్వుతూ. అంటే అర్థం బాగా చెప్పినట్టా, చెప్పనట్టా అన్నది ప్రభాకరానికి బోధ పడలేదు.

భోజనం ముగించి లేచి వచ్చారు. ఆ అమ్మాయి తాంబూలం తెచ్చి పెట్టింది.

"అలవాటు లేదండీ," అన్నాడు ప్రభాకరం.

"ఫరవాలేదు వేసుకోండి" అంది, అమ్మాయి మాటలు అవీచూస్తే మర్యాదా, మన్ననా తెలిసిన వ్యక్తిలాగుంది అనుకున్నాడు ప్రభాకరం.

తాంబూలాలు వేసుకున్న తర్వాత "ఏమండీ! ఇక మనం లెక్కలు చూద్దామా?" అన్నాడు ప్రభాకరం.

కరణంగారు రికార్డులన్నీ తీసి లాంతరుముందు పెట్టాడు.

ఇంతలోనే నలుగురైదుగురువచ్చి కింద కూచున్నారు.

"ఏరా యిలా వచ్చారు? అన్నాడు నారాయణరావు.

ఇదిగో ఈ మునిగాడి విషయమే. నాలుగు రోజులుగా మీ ఇంటి చుట్టూ తిరుగుతున్నాం. మీరు ఊళ్లో లేరు. ఈ రోజన్నా ఏదో ఒకటి చెయ్యండి," అన్నాడు వాళ్ళలో ఒకడు.

"వేళాపాళా లేదురా పంచాయతీకి?" అన్నాడు కరణంగారు.

"మళ్ళీ ప్రొద్దున కోతలు, తీరుబాటెక్కడ సామీ?" అన్నాడు వాడు.

"సరే, లచ్చిని. దాని తల్లినికూడా పిలిపించండి" అన్నాడు. కరణంగారు. ప్రభాకరం వైపు తిరిగి "ఇక మన పని ఉదయమేనండి. వీళ్ళది చిన్న తగాదా ఒకటివుంది. అదేదో చూడాలి," అన్నాడు,

రామాయణంలో పిడకల వేటలా మధ్యలో తన పనికి అంటకం కలిగినందుకు, ప్రభాకరానికి విసుగ్గానేవుంది. కానీ ఏం చెయ్యగలడు.

"ఏమిటండీ ఈ పంచాయతీ?" అన్నాడు ప్రభాకరం.

"ఈ పాడు గొడవలు మీకెందుకులేండి." అంది నిర్మల ఇల్లు సర్ది బయటకు వస్తూ.

"ఒరే ! అయ్యగారికి మంచం బయటవెయ్యి, పండుకుంటారు" అంటూ వచ్చిన వాళ్ళలో ఒకరికి పని పురమాయించింది.

"అవును మీరు వెళ్ళి పడుకోండి," అన్నాడు కరణంగారు,

"లేదులేండి, నేనూ వింటాను కాసేపు కాలక్షేపం. అయినా ఎనిమిది కాలేదు. అపుడే నిద్రకు తొందరే మొచ్చింది," అన్నాడు ప్రభాకరం. నిర్మల కూడా తాంబూలం నములుతూ గడపమీద కూర్చుంది.

"విషయమేమిటండీ ?" అన్నాడు ప్రభాకరం మళ్ళా.

కరణంగారు వారితో మాటల్లో మునిగి పోయ్యాడు, ఇక ప్రభాకరం మాటలు చెవుల్లో ఏం పడతాయి ? నిర్మలే వివరించింది.

"అక్కడ కూర్చున్నాడు చూడండి – వాణ్ణి – వాడి పెళ్ళాం వదిలేసింది. అది తగాదా," అంది. కరణంగారితో వాళ్ళు ఇల్లు ఎత్తి పోయేట్టు తమ వాదన చెబుతున్నారు. ఆయన వింటున్నాడు.

"ఎందుకు వదిలిందండీ" అన్నాడు నిర్మలతో.

"అలగా జనం. అలగా బుద్ధులు," అంది నిర్మల.

ప్రభాకరం ఆ భార్యా బాధితుడి వైపు చూచాడు. మంచి కండ పుష్టి. లక్షణంగా వున్నాడు. వీణ్ని వదలడానికి ఆ పెళ్ళానికి మనసు ఎట్లా వొప్పిందో అర్థంకాలేదు.

ఇంతలోనే అవతల పార్టీ వాళ్ళు కూడా వచ్చారు. ఇద్దరే వున్నారు ఆ అమ్మాయి, ఆ అమ్మాయి తల్లీ.

కరణంగారు కాపరానికి పంపమని తల్లికి చెబుతున్నాడు. ఆ తల్లి "నాదేముంది దానికి యిష్టమైతే," అంటోంది. ఆ కూతురు ఉలకనూలేదు, పలకనూ లేదు, ఆ అమ్మాయికూడా బాగానేవుంది. ఇద్దరిదీ ముచ్చటైన జంట. ఇద్దరి మధ్య ఎందుకు బెడిసిందో ప్రభాకరానికి అర్థంకాలేదు.

"ఏమే లచ్చీ, బెల్లంకొట్టిన రాయిలా కూర్చుంటే లాభంలేదు. మొగుణ్ని విడిచి నీ యిష్టమొచ్చినట్టు తిరుగుతానంటే, ఇది ఊరా పాడా?

నిన్నుజూచి ఇంకా నలుగురు నేర్చుకుంటారు." అంటూ కరణంగారు గదమాయిస్తున్నారు.

"ఏ బావిలోనైనా దూకి చావనైనా చస్తానుగాని, కాపరానికి పోను," అంటోంది ఆ అమ్మాయి.

ఏదో కారణం వుండాలనిపించింది ప్రభాకరానికి.

"ఏమండీ ఆ అమ్మాయి ఎందుకు వెళ్ళనంటోంది :" అన్నాడు. ప్రభాకరం నిర్మలతో.

"ఏం లేదండీ. వీడు తాగుబోతు వెధవ. తాగి దీన్ని బాగా తంతాడు. పైగా ఎవత్తెనో ఒకదాన్ని వుంచుకున్నాడట. దీనికొ్కంచెం అభిమానం జాస్తి" అంది.

"అయితే ఆ అమ్మాయి పట్టుదలకు కారణం వుందన్నమాటే."

"మెడనపడ్డ పాము కరవక మానదని, కట్టుకున్నాక తప్పుతుందా? ఎలాగో సరుకుపోవాలి. ఈ అలగా జనానికి ఆ తెలివి లేదండీ. పరువా, ప్రతిష్టా ? లోకానికీ భయంలేదు – సంఘానికీ భయంలేదు. బ్రతుకుతెరువు పోతుందే అని అన్నా భయపడటానికి అదీలేదు. ఎక్కడున్నా రెక్కల కష్టం తప్పదు" అంది నిర్మల.

కరణంగారు నయానా భయానా కూడా ఆ ఆమ్మాయికి నచ్చచెప్పి చూశాడు. కాని ఆ అమ్మాయి తన అభిప్రాయం మార్చుకోలేదు.

కరణంగారు చెప్పి చెప్పి విసుగొచ్చాక "మీ తాడు ఎలాగన్నా తెంచుకోండి. ఈ పంచాయతీ నేను చెయ్యలేను" అంటూ అపజయాన్ని అంగీకరించాడు,

వాళ్ళు చేసేదిలేక కరణంగారితో సెలవుతీసుకొని వెళ్ళిపొయ్యారు.

"ఈ అరుపులకు తలనొప్పి వచ్చింది" అంటూ నిర్మల తల పట్టుకుంది.

"వాడికేమండీ, మగమహారాజు. తాగుతాడు, ఒకరికి బదులు నలుగుర్ని వుంచుకుంటాడు. ఇది నా మొగుడు అక్కర్లేదంటే ఏమన్నమాట

"మదపు లం...." అంటూ కరణంగారు బూతులు తిట్టటానికి మొదలు పెట్టుతూ.

"సరే, ఇంకా ఎందుకు ఆ పాడుగద్దె. ఇక పడుకోండి" అంటూ నిర్మలా వాళ్ళ నాన్న చెవిదగ్గర కేకపెట్టింది.

ఇందాకా వచ్చిన వాళ్ళతో నిర్మల మంచాలు బయట వేయించి పరుపులు పరిపించి పెట్టింది. ముగ్గురువచ్చి పడుకున్నారు.

ఆకాశంలో బాగా మబ్బులు పట్టి చీకటిగావుంది. వూరు అప్పుడే మాటుమణిగి నిశ్శబ్దంగా వుంది. కప్పల అరుపులు మాత్రం వినిపిస్తు న్నాయి. ప్రభాకరం ముసుగుదన్ని పడుకున్నాడు. కాని నిద్ర రావడం లేదు. కరణంగారు అప్పుడే గుర్రు పెడుతున్నారు. ప్రభాకరానికి ఏమీ తోచక సిగరెట్టు తీసివెలిగించాడు.

"ఏమండీ నిద్రరావడంలేదా? అంది నిర్మల. ప్రభాకరం వులిక్కి పడ్డాడు. పంద్రెండయింది. ఆమె యింకా మేల్కొనేవుంది.

"మీకూ నిద్రరాలేదా?" అన్నాడు ప్రభాకరం.

"వర్షం వస్తుందేమో చలిగాలి కొడుతుంది." అంది నిర్మల.

ప్రభాకరం మంచంమీద లేచి కూర్చున్నాడు. నిర్మల యింకా ఎందుకు మేల్కొని వుంది. నిర్మల మనసులో.... తన అంచనా పొరపా టయితే తను మళ్ళీ ఊరు మొగం చూడలేడు. ఎలా కనుక్కోవడం? నిర్మల మంచంవైపు చూచాడు. చీకట్లో కళ్ళు మెరుస్తున్నాయి. వెలిగిం చిన సిగరెట్టుతో సైగ చేశాడు. ఆ అమ్మాయి నవ్వుకున్నట్టుంది. తెల్లగా పళ్ళు కన్పిస్తున్నాయి. ధైర్యంచేసి మంచం దగ్గరకు వెళ్ళాడు. నిర్మల పక్కకు జరిగి స్థలం చూపింది. వెచ్చగా నిర్మల వంటి స్పర్శ తగిలే వరకూ – ప్రభాకరం ఇది కలగాదుగదా అంకుంటూనే వున్నాడు.

* * *

ప్రభాకరం నిర్మల పక్కమీదనుంచి లేచివస్తూ కరణంగారివైపు చూశాడు. ఆయన గుర్రు పెడుతూనే వున్నాడు, తాను చేసిన సాహసం

తలుచుకుంటే భయం కలిగింది. తెల్లారగట్ల మూడింటికి మళ్ళీ ఆ భయం తొలిగింది.

ఉదయం లేచేసరికి ప్రభాకరం కళ్లు జ్యోతుల్లా వున్నాయి. అసలు కన్ను మూసింది ఎప్పుడు గనక ?

"అదేమిటి కళ్ళు అలా వున్నాయి ?" అన్నారు కరణంగారు.

"కొత్తచోటు కదండీ నిద్ర పట్టలేదు" అన్నాడు ప్రభాకరం.

"అబద్ధాలు చెప్పకండి-ఆడపిల్లలు వుడతారు" అంది నిర్మల అటువైపు తిరిగి.

"నీకా, నాకా" అన్నాడు ప్రభాకరం పెదవులు కదలిక కరణం గారికి కన్పించకుండా ముఖం ప్రక్కకు తిప్పి.

కాఫీ తాగిన తరువాత గంటలో ప్రభాకరం పని పూర్తి చేసుకున్నాడు.

"ఇక మీరు వెళ్లొచ్చు" అన్నాడు కరణంగారు. ప్రభాకరానికి బాధగానే వుంది.

"జిప్ బ్యాగ్ వుంది. వెట్టివాణ్ని పంపండి నాన్నా రోడ్డుదాకా" అంటూ నిర్మల సిఫార్సు చేసింది.

కరణంగారు వెట్టికి జిప్ అందించాడు.

ప్రభాకరం ఇద్దరితోనూ ఒకేసారి "వస్తానండీ" అన్నాడు.

"వెళ్ళిరండి" అంది నిర్మల.

ప్రభాకరం దారిపట్టాడు కాని-స్వర్గం వదలి వస్తున్నట్టుగావుంది. రోడ్డు దగ్గిరికి వచ్చేసరికీ రెండు గంటలు పట్టింది, వెట్టి టీ తాగడానికని టీ హోటల్‌లోకి దూరాడు. జిప్‌బ్యాగ్ వాడిదగ్గరేవుంది, దూరాన బస్సు

వస్తోంది, బ్యాగ్ కోసమని హోటల్‌లోకి వచ్చాడు. తన వెంటవచ్చిన వెట్టివాడు ఎవరో "ఆడంగిరేకుల" వాణ్ణి ఆట పట్టిస్తున్నాడు,

"బస్సు వస్తోంది బ్యాగ్ యిలాయివ్వు" అన్నాడు.

వాడు బ్యాగ్ చేతికిచ్చి "మన కరణంగారి అల్లుడండీ, ఇప్పుడే బస్సు దిగాడు" అన్నాడు,

ఆ "ఆడంగిరేకులవాడు" నిర్మల మొగుడా? ప్రభాకర్ షాక్ తిన్నాడు.